క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ కమిటీల నియామకంపై చర్చ



వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజుతో చర్చిస్తున్న ఖాదర్ బాషా

మహారాణిపేట: మద్దిలపాలెంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం పార్టీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజును ఆ పార్టీ రాష్ట్ర మైనారిటీ విభాగం అధ్యక్షుడు ఖాదర్ బాషా మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర, జిల్లా, వార్డు కమిటీల నియామకాలపై చర్చించారు. సమావేశంలో పార్టీ గాజువాక సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి, మైనారిటీ విభాగం జిల్లా అధ్యక్షుడు బర్కత్ అలీ, జోనల్ అధ్యక్షుడు అబ్దుల్ బషీరుద్దీన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.ఎ.కరీం బాషా, రాష్ట్ర కార్యదర్శి హసన్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

సీఆర్పీఎఫ్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న సీఆర్పీఎఫ్ కమాండెంట్ రాం పలాట్ తదితరులు

జగదాంబ: సెంట్రల్ పోలీస్ రిజర్వ్ ఫోర్స్ (సీఆర్‌పీఎఫ్) ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. సోమవారం నేషనల్ వాలంటరీ బ్లడ్ డొనేషన్ సందర్భంగా జగదాంబ వద్ద ఉన్న 198 సీఆర్‌పీఎఫ్ బెటాలియన్, రెడ్‌క్రాస్ సొసైటీతో కలసి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా కమాండెంట్ రాం పలాట్ మాట్లాడుతూ రక్తదానం చేసి పది మందికి ప్రాణదానం చేయడం సంతోషాన్ని ఇస్తుందన్నారు. తమ సిబ్బంది అంతా కలిసి 40 యూనిట్ల రక్తం దానం చేశామన్నారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ అధికారులు మహ్మద్ సిరాజ్, కిశోర్, సంతోష్, రోస్ తదితరులు పాల్గొన్నారు.

జోన్-5 పీజీఆర్ఎస్‌కు రెండే వినతులు



సమస్యలు తెలుసుకుంటున్న జోన్-5 కమిషనర్ బొడ్డేపల్లి రాము

కంచరపాలెం: జ్ఞానాపురంలోని జీవీఎంసీ జోన్-5 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి రెండు వినతులు అందాయి. అర్జీదారుల నుంచి వాటిని జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము స్వీకరించి పరిశీలించారు. టౌన్ ప్లానింగ్ విభాగానికి 02 అర్జీలు వచ్చినట్లు జెడ్సీ తెలిపారు. పీజీఆర్ఎస్‌కు అందిన ప్రజా వినతులను తక్షణం పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో రెవెన్యూ ఆర్‌వోలు బాబూరావు, రాజ్యలక్ష్మి, ఆర్ఐ కాకర శ్రీనివాసరావు, ఇంజినీరింగ్ ఈఈలు తారా ప్రసన్నరెడ్డి, పద్మావతి, డీఈ భరణికుమార్, విద్యుత్ లైట్ల ఏఈ అర్చన, వాటర్ ఏఈ సుమన్, టౌన్ ప్లానింగ్ ఏసీపీ తిరుపతిరావు, టీపీవో ప్రవీణ్‌కుమార్, పబ్లిక్ హెల్త్ ఇన్‌చార్జి ఏఎంహెచ్‌వో జనార్దనరావు, ఏపీడీవో కృపానందం, పి.పుణ్యవతి, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యతో పాటు క్రీడలూ అవసరమే



బైద్య సూర్యప్రకాష్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

అల్లిపురం: ఉజ్వల భవిష్యత్తుకు విద్యతో పాటు క్రీడలూ అవసరమని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. విశాఖ వ్యాలీ విద్యార్థి ఆర్. బైద్య సూర్య ప్రకాష్ మోడ్రన్ పెంటాథలాన్, బయాథలాన్ ఒలింపిక్ క్రీడల్లో 5వ స్థానం సాధించిన నేపథ్యంలో సోమవారం సాయంత్రం డాబాగార్డెన్స్‌లో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో ఆయన పాల్గొని అభినందించారు. జిల్లా విద్యాశాఖాధికారి ఎస్. ప్రేమ్ కుమార్, ఎస్ 3 ఎరీనా వ్యవస్థాపకుడు సహాని కంచర్ల, విశాఖ వ్యాలీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఈశ్వరి ప్రభాకర్, తల్లిదండ్రులు, గురువులు పాల్గొన్నారు.

- 29, 30 వార్డుల్లో గుంపులు గుంపులుగా సంచరిస్తున్న వైనం
- భయం భయంగా స్థానికులు, పాదచారుల రాకపోకలు
- ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ప్రజల ఆరోపణ



శునకాల స్వైరవిహారం





30వ వార్డులో విచ్చలవిడిగా సంచరిస్తున్న కుక్కలు

డాబాగార్డెన్స్: జీవీఎంసీ 29, 30 వార్డుల్లోని పలు వీధుల్లో కుక్కలు గుంపులు గుంపులుగా స్వైర విహారం చేస్తూ స్థానికులు, పాదచారులు, వాహన చోదకులను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. ఆయా వీధులు, రోడ్లపై సంచరిస్తూ దారిన పోయే వారి వెంటపడుతున్నాయి. గత వారం రోజుల్లో ఆయా ప్రాంతాల్లో పలువురు స్థానికులు, పాదచారులపై కుక్కలు దాడికి దిగి గాయపరిచాయి. 29వ వార్డు పరిధిలో పలు వీధుల్లో కుక్కల బెడద మరింత తీవ్రంగా ఉంది.

పగలూ.. రాత్రి లేకుండా పాదచారులు, వాహన చోదకుల వెంట పడతున్నాయి. కుక్కల బారిన పడి పలువురు గాయాలపాలయ్యారు. వాటి అరుపులకు రాత్రిళ్లు నిద్ర కూడా పట్టడం లేదని దిబ్బలపాలెం, చందకవీధి వాసులు వాపోతున్నారు. అర్ధరాత్రి దాటాక విధులు ముగించుకుని ఇళ్లకు వెళ్లే వారిని కుక్కలు వెంటపడి తరుముతున్నాయి.

పరుగులు పెట్టిస్తున్నాయి..

ఇటీవల 29,30 వార్డుల పరిధిలో పిల్లలు, పెద్దలను పరుగులు పెట్టించి మరీ కుక్కలు వారిపై దాడి చేశాయి. దిబ్బలపాలెంలో పలువురు పాదచారులపై, చందకవీధిలో మరి కొంత మందిపై, పలువురు వాహన చోదకులపై కుక్కలు దాడి చేశాయి. ఆయా వీధుల్లో ఎక్కడో ఒకచోట ఎవరో ఒకరు కుక్కకాటుకు గురవుతున్నారు. గుంపులు గుంపులుగా అవి సంచరిస్తుండడంతో రోడ్డు మీదకు వచ్చేందుకు జనాలు జంకుతున్నారు. పలు ప్రాంతాల్లో కుక్కలు వాహన చోదకులను పరుగులు పెట్టిస్తున్నాయి. ఈ ప్రాంతంలో పాఠశాలలు ఎక్కువగా ఉండడంతో పిల్లలు స్కూళ్లకు వెళ్లేటప్పుడు కుక్కలను చూసి భయపడుతున్నారు. ఈ సమస్యపై ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదని పలువురు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

తీసుకెళ్తున్నారు.. వదిలేస్తున్నారు..

వీధుల్లో గ్రామసింహాల హడావిడి ఎక్కువగా ఉంది. దీనిపై ఫిర్యాదు చేస్తే కుక్కలు పట్టేవారు వస్తున్నారు. వాటిని తీసుకెళ్తున్నారు. వ్యాక్సిన్ వేసి తిరిగి ఎక్కడైతే పట్టుకున్నారో అక్కడే విడిచిపెడుతున్నారు. దీని వల్ల కుక్కల బెడద మరింత ఎక్కువగా ఉందని స్థానికులు వాపోతున్నారు. అడిగితే ఏవేవో గైడ్ లైన్స్ చెబుతున్నారు. మరి వాటి నియంత్రణ ఎక్కడ? అంటూ పలువురు వాపోతున్నారు. పరిష్కారం లేదా? అని ప్రశ్నిస్తున్నారు.

కుక్కల నియంత్రణకు చర్యలు ఏవీ?



కుక్కల నియంత్రణకు జీవీఎంసీ అధికారులు చర్యలు చేపట్టడం లేదు. వీధి కుక్కలను తీసుకెళ్లి ఇంజక్షన్లు వేసి మళ్లీ వదిలేయడంతో అవి తిరిగి వచ్చేస్తున్నాయి. కుక్కలను తరలించే వాహనం కనబడడంలేదు. సమస్యను పరిశీలించి అధికారులు చర్యలు చేపట్టాలి. ఈ విషయమై సచివాలయంలో ఫిర్యాదు చేసినా స్పందన కరవవ్వడంతో జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో ఫిర్యాదు చేశాం. – నాగమణి, దిబ్బలపాలెం

రాత్రిళ్లు వాహనాల వెంటపడుతున్నాయి..



రాత్రిపూట విధులు ముగించుకుని ఇంటికి వెళ్తున్న సమయంలో కుక్కలు గుంపులు గుంపులుగా టూ వీలర్ల వెంట పడుతున్నాయి. దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. పలువురు గాయపడిన సందర్భాలు ఉన్నాయి. ఈ విషయమై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. కుక్కల సమస్య వల్ల రాత్రిళ్లు బయటికి వెళ్లి ఇళ్లకు రావడానికి కూడా భయపడుతున్నాం.

–బండారు లోకేష్ కుమార్, మహారాణిపేట

సమస్యల పరిష్కారంలో జాప్యం తగదు



వినతులు స్వీకరిస్తున్న జెడ్సీ మల్లయ్యనాయుడు

జగదాంబ: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ప్రజలు వినియోగించుకోవాలని జీవీఎంసీ జోన్-4 జోనల్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు అన్నారు. సోమవారం జోన్-4 కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి పబ్లిక్ హెల్త్ నుండి 1, రెవెన్యూ విభాగం నుంచి 3 వినతులు వచ్చాయి. ఈ సందర్భంగా జెడ్సీ మాట్లాడుతూ గ్రీవెన్స్ సెల్ ద్వారా వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. అర్జీదారులను కార్యాలయాల చుట్టూ తిప్పకూడదన్నారు. సమస్యల పరిష్కారం తర్వాత సమస్య పరిష్కారం అయ్యిందీ లేనిదీ అడిగి తెలుసుకోవాలన్నారు. పరిష్కరించిన సమస్యలను రికార్డులో నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంహెచ్‌వో కృష్ణంరాజు, ఇంజినీరింగ్ అధికారి వెంకటేశ్వరరావు, యూజీడీ, ఎలక్ట్రికల్ ఏఈలు, తాగునీటి విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

శ్రద్ధగా మొక్కలు సంరక్షించాలి



కూడళ్ల మధ్యలో ఉన్న మొక్కలను పరిశీలిస్తున్న జెడ్సీ మల్లయ్యనాయుడు

జగదాంబ: సెంట్రల్ మీడియాన్‌లో మొక్కలను శ్రద్ధగా సంరక్షించాలని జీవీఎంసీ జోన్-4 కమిషనర్ ఎం. మల్లయ్యనాయుడు అన్నారు. సోమవారం ఆయన జోన్ పరిధిలోని 12 వార్డులను పరిశీలించారు. రహదారులు, కూడళ్ల మధ్య ఉన్న సెంట్రల్ మీడియాన్‌లోని మొక్కలకు నీటి సదుపాయం లేదన్నారు. మొక్కల మధ్యలో ఉన్న వ్యర్థాలను తొలగించాలన్నారు. ప్రతిరోజు హార్టీకల్చర్ అధికారులు పర్యవేక్షించాలన్నారు. నీటి సదుపాయం కల్పించి ఏపుగా ఎదిగిన మొక్కలను కట్ చేసి అందంగా తీర్చిదిద్దాలన్నారు. మొక్కలు డివైడర్ల మీదుగా రోడ్డు మీదకు రాకుండా చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హార్టీకల్చర్ అధికారులు, సిబ్బంది తదితరుల పాల్గొన్నారు.

సరస్వతీ అవతారంలో పూజలందుకున్న దుర్గమ్మ



కన్యకాపరమేశ్వరి ఆలయంలో సరస్వతీ పూజలో పాల్గొన్న చిన్నారులు



బంగారుమెట్టలో సరస్వతీదేవిగా దుర్గమ్మ



సరస్వతీ దేవి అవతారంలో ఉమాదేవి



ధన శక్తి పీఠంలో దుర్గమ్మ



సాగర గిరి కనకదుర్గమ్మ

డాబాగార్డెన్స్: కురుపాం మార్కెట్‌లో వెలసిన కన్యకాపరమేశ్వరి అమ్మవారు 8వ రోజు సోమవారం సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, తిరిగి 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యార్థులచే సరస్వతీ పూజలు జరిపారు. మంగళవారం కన్యకాపరమేశ్వరి మహాలక్ష్మీదేవిగా దర్శనమివ్వనున్నట్టు ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో బాలాత్రిపుర సుందరి నృత్యనికేతన్‌చే కూచిపూడి నృత్య ప్రదర్శన ఏర్పాటు చేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్లు పూసర్ల సురేష్‌కుమార్, సుగ్గు శివ, కంకటాల సతీష్, దేవాలయ అధ్యక్షుడు ఆరిశెట్టి దినకర్, కార్యదర్శి పెనుగొండ కామరాజు, కోశాధికారి దోమ వెంకట బాలాజీ కుమార్, ఉత్సవ కమిటీ సభ్యులు, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

సరస్వతీదేవిగా దుర్గాలమ్మ..

వెలంపేటలో వెలసిన దుర్గాదేవి అమ్మవారు సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. మంగళవారం అమ్మవారు దుర్గాదేవిగా దర్శనమివ్వనున్నట్టు ఆలయ ఈవో పైలా శేఖర్‌బాబు తెలిపారు.

సరస్వతీదేవిగా దుర్గమ్మ..

అల్లిపురం: శివరామకృష్ణ దేవస్థానంలో ఉమాదేవి అమ్మవారు సరస్వతీ దేవిగా దర్శనమిచ్చారు. సాగరగిరి కనకదుర్గమ్మను సరస్వతీ దేవిగా అలంకరించారు. అల్లిపురం మెయిన్‌రోడ్డులో గల శ్రీ ధనశక్తి పీఠంలో దుర్గమ్మ వారు సరస్వతీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. బంగారుమెట్టలో వైఎస్సార్‌సీపీ నాయకుడు బూరుల చిన్న దంపతులు ఏర్పాటు చేసిన దుర్గమ్మ భక్తులను విశేషంగా ఆకట్టుకున్నారు.

బంగారమ్మ మెట్టలో..

దసరా నవరాత్రుల సందర్భంగా సోమవారం బంగారమ్మమెట్టలో 33వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు బూరల చిన్నా దంపతులు దుర్గా పడి పూజ వైభవంగా నిర్వహించారు. శూలాలతో సహా అమ్మవారి ప్రతిమలను ఏర్పాటు చేసి సుమారు 58 కుందులతో ఏర్పాటు చేసిన దీపాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. భవానీలకు ప్రసాద వితరణ చేపట్టారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

ఈపీడీసీఎల్ సర్కిల్ కార్యాలయంలో..

గ్రీన్‌పార్క్ దరి ఈపీడీసీఎల్ కార్యాలయంలో సోమవారం దుర్గాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. డీజీఎం కృష్ణకుమారి, ఈఈ పోలాకి శ్రీనివాస్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు శిరీష గాయత్రి, పి.జ్యోతి, విద్యాసాగర్, సుమన్, ఏఏవోలు, జేఏవోలు, సిబ్బంది పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు.

గౌరీ పరమేశ్వరుల ఉత్సవాలకు శ్రీకారం

అల్లిపురం: వెంకటేశ్వరమెట్ట, శ్రీ వెంకట గౌరీ శంకర గ్రంథాలయం, శ్రీ గౌరీ సేవా సంఘం సంయుక్త ఆధ్వర్యంలో అక్టోబర్ 18వ తేదీ నుంచి 78వ శ్రీ గౌరీ పరమేశ్వరుల ఉత్సవాలకు గౌరీ సేవా సంఘం అధ్యక్షుడు పాలమరశెట్టి శ్యామ్‌కుమార్ దంపతులు పూజలు నిర్వహించి పందిరి రాటను నిలిపారు. ఈ సందర్భంగా హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

అదానీ సిమెంట్ కంపెనీకి అనుమతులు రద్దు చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న జగ్గునాయుడు, కృష్ణారావు, యుఎస్ఎన్ రాజు

డాబాగార్డెన్స్: పెదగంట్యాడలోని జనావాసాల మధ్య ఏర్పాటు చేయ తలపెట్టిన అదానీ సిమెంట్ కంపెనీకి అనుమతులు, ప్రజాభిప్రాయ సేకరణను రద్దు చేయాలని సీపీఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు డిమాండ్ చేశారు. పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు వి.కృష్ణారావు, జిల్లా కమిటీ సభ్యుడు యూఎస్ఎన్ రాజుతో కలిసి సోమవారం సిటు జిల్లా కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జగ్గునాయుడు మాట్లాడుతూ అదానీ అంబుజా సిమెంట్స్ కంపెనీ సాగరతీరం, జనావాసాలకు మధ్య ఏర్పాటు వల్ల గంగవరం, పెదగంట్యాడ తదితర గాజువాక అసెంబ్లీ నియోజకవర్గం, సింధియా, శ్రీహరిపురం వరకు పశ్చిమ నియోజకవర్గ పరిసర ప్రాంతాల్లో నివాసముంటున్న సుమారు 10 లక్షల మంది ఆరోగ్యాలకు హానీ జరుగుతుందన్నారు. ఈ పరిశ్రమ వల్ల గాలి, నీరు, భూగర్భ జలాలు కలుషితమవుతాయని చెప్పారు. శబ్ద కాలుష్యం పెరుగుతుందన్నారు. భారీ వాహనాల రాకపోకలు పెరిగి ప్రమాదాలు జరిగే అవకాశం, ప్రాణనష్టం అధికమయ్యే ప్రమాదం ఉందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, విశాఖ ఎంపీ భరత్, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు వెంటనే జోక్యం చేసుకోవాలని, ఈ కంపెనీ అనుమతులు, పబ్లిక్ హియరింగ్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలు, ప్రజా సంఘాలు, ప్రముఖులు, పర్యావరణ పరిరక్షణ సంస్థలు, అపార్టుమెంట్, నివాస ప్రాంతాల అసోసియేషన్లు, గ్రామ సంఘాలు అదానీ సిమెంట్ కంపెనీ పబ్లిక్ హియరింగ్‌ను రద్దు చేసేందుకు సన్నద్ధం కావాలని విజ్ఞప్తి చేశారు.

మరిడిమాంబ ఉత్సవాలకు శ్రీకారం



డోలు చాటింపు ఉత్సవాన్ని ప్రారంభిస్తున్న పోలీస్ కమిషనర్ శంకబ్రత బాగ్చి

డాబాగార్డెన్స్: మీద రెల్లివీధి, కొత్త రెల్లివీధి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించనున్న గ్రామదేవత మరిడిమాంబ పండగలో భాగంగా సోమవారం అమ్మవారి డోలు చాటింపు కార్యక్రమం నిర్వహించారు. 150 ఏళ్ల చరిత్ర గల మరిడిమాంబ అమ్మవారి ఉత్సవాలు ప్రతి మూడేళ్లకోసారి నిర్వహిస్తుంటారు. మహోత్సవాన్ని పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, టీడీపీ నాయకుడు సీతంరాజు సుధాకర్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు కమలాకర్, బీజేపీ నాయకుడు పరశురామ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ఘన చరిత్ర గల మరిడిమాంబ ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని కోరారు. కార్యక్రమంలో వన్‌టౌన్ సీఐ జీడీ బాబు, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాసరావు, కార్యదర్శి వద్దాది ప్రతాప్ (బుజ్జి), ఉపాధ్యక్షుడు మాడుగుల సత్యనారాయణ, కోశాధికారి రత్తాపు రామచంద్రరావు, సహాయ కోశాధికారి బంగారి సింహాచలం, గౌరవ అధ్యక్షుడు వద్దాది చిన్నారెడ్డితో పాటు కొత్తరెల్లివీధి ఉత్సవ కమిటీ సభ్యులు వి.ఉమాపతి, అరవింద్, ఎస్.ఎర్రిబాబు, బంగారి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సూపర్ జీఎస్టీ కరపత్రాల ఆవిష్కరణ



గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్

మహారాణిపేట: సూపర్ జీఎస్టీ–సూపర్ సేవింగ్స్ అవగాహన కరపత్రాలను కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ఆవిష్కరించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. జీఎస్టీ 2.0 పేరిట ప్రత్యేక ప్రచార కార్యక్రమాన్ని ఈనెల 29 నుంచి వచ్చేనెల 19వ తేదీ వరకు జిల్లాలో నిర్వహించేందుకు ప్రణాళిక తయారు చేశారు. ఈ కార్యక్రమంలో పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగుల జీవితాలు ఆనందమయం కావాలి



పదవీ విరమణ చేసిన ఉద్యోగులను సత్కరిస్తున్న మేయర్, డిప్యూటీ మేయర్, ఇతర అధికారులు

డాబాగార్డెన్స్: ఉద్యోగ విరమణ చేసిన ప్రతి ఒక్కరి శేష జీవితం ఆనందదాయకంగా ఉండాలని మేయర్ పీలా శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీలో పలు విభాగాల్లో వివిధ హోదాల్లో విధులు నిర్వర్తించి ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులను డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరాజుతో కలిసి మేయర్ సత్కరించారు. కార్యనిర్వాహక ఇంజినీర్ శ్రీధర్‌తో పాటు ఇద్దరు పర్మినెంట్ ఉద్యోగులు, 12 మంది పారుగు సేవల సిబ్బంది విరమణ చేశారని తెలిపారు. వారికి ప్రావిడెంట్ ఫండ్ అందించి, సత్కరించారు. కార్యక్రమంలో జీవీఎంసీ అదనపు కమిషనర్లు డీవీ రమణమూర్తి, ఎస్ఎస్ వర్మ, ప్రధాన ఇంజినీర్ సత్యనారాయణరాజు, ప్రధాన వైద్యాధికారి నరేష్‌కుమార్, పర్యవేక్షక ఇంజినీర్ (ఎలక్ట్రికల్) సంపత్‌కుమార్, సిటీ వెటర్నరీ ఆఫీసర్, జీవీఎంసీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ అప్పలనాయుడు, పర్యవేక్షకుడు సన్యాసిరావు, పదవీ విరమణ చేసిన ఉద్యోగుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఆదుకోవాలని చిరు వ్యాపారుల వినతి



కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న చిరు వ్యాపారులు

మహారాణిపేట: తొలగించిన తోపుడు బండ్లను యథావిధిగా కొనసాగించాలని కోరుతూ సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట చిరు వ్యాపారులు నిరసన ప్రదర్శన చేపట్టారు. విశాఖపట్నం తోపుడు బండ్ల కార్మిక సంఘం (సీఐటీయూ) ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పలువురు కార్మికులు పాల్గొన్నారు. తమపై దాడులు ఆపి, ఉపాధి కల్పించాలని డిమాండ్ చేస్తూ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. సుప్రీం కోర్టు గైడ్‌లైన్స్ ప్రకారం రోడ్డు పక్కన వ్యాపారం చేసుకునే తమను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ. సింహాచలం, సీఐటీయూ మద్దిలపాలెం జోన్ కార్యదర్శి పి.వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో గర్భిణులు, బాలింతలకు మేలు



అవగాహన ర్యాలీలో వైద్యులు అంగన్‌వాడీలు

కంచరపాలెం: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని జోన్-5 కమిషనర్ బొడ్డేపల్లి రాము అన్నారు. 41వ వార్డు కప్పరాడ పీహెచ్‌సీ వద్ద ఐసీడీఎస్, వైద్యాధికారుల సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం పోషణ మహా, స్వస్త్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీలు ఏర్పాటు చేసిన స్టాళ్లను జెడ్సీ పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు, అంగన్‌వాడీ టీచర్, కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

ఈవో రమాబాయికి సత్కారం



పదవీ విరమణ చేయనున్న ఈవో రమాబాయిని సత్కరిస్తున్న అతిథులు

మహారాణిపేట: సోమవారం టర్నర్ సత్రం ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సెప్టెంబర్ 30న పదవీ విరమణ చేయనున్న ఎరుకుమాంబ అమ్మవారి దేవస్థానం ఈవో జీవీ రమాబాయి, తమ్మన వెంకట కృష్ణారావు దంపతులను ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా దేవదాయ శాఖ విశాఖ, అనకాపల్లి జిల్లాల సహాయ కమిషనర్లు (ఏసీ) టి.అన్నపూర్ణ, ఎస్. సుధారాణి ఈవో రమాబాయి దంపతులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉప కమిషనర్ కార్యాలయ సూపరింటెండెంట్ విజయకుమార్, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లు, దేవదాయ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆకర్షణీయంగా బొమ్మల కొలువు



ఆకట్టుకుంటున్న బొమ్మల కొలువు

డాబాగార్డెన్స్: స్థానిక నౌరోజీ రోడ్డులో ప్రముఖ చర్మవ్యాధుల నిపుణుడు, విశాఖ రసజ్ఞ వేదిక అధ్యక్షుడు డాక్టర్ జి.రఘురామారావు సతీమణి జి.శాంతిరావు ఆకర్షణీయంగా బొమ్మల కొలువు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 25 ఏళ్లకు పైగా క్రమం తప్పకుండా దేవీ శరన్నవరాత్రుల సమయంలో బొమ్మల కొలువు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. తద్వారా మన ధర్మాన్ని అనుసరించడమే కాక, సనాతన సంప్రదాయానికి ప్రాముఖ్యత ఇస్తున్నట్లు తెలిపారు. బొమ్మల కొలువు చూడడానికి స్థానికులే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి మహిళలు పెద్ద ఎత్తున వస్తున్నారని చెప్పారు.

భగత్‌సింగ్ స్ఫూర్తి ప్రతి ఒక్కరికీ ఆదర్శం



మాట్లాడుతున్న వ్యాపారవేత్త ఆనంద్‌సింగ్

డాబాగార్డెన్స్: భగత్‌సింగ్ జయంతిని పురస్కరించుకుని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఈవీఆర్ శాస్త్రి స్వరకల్పనలో రూపొందించిన దేశభక్తి గీతాన్ని సోమవారం ప్రముఖ వ్యాపారవేత్త ఆనంద్ సింగ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగత్‌సింగ్ వీరోచిత జీవితం ప్రతి భారతీయునికి ప్రేరణ అని, ఈవీఆర్ శాస్త్రి సాహిత్య పటిమతో, ఈ గీతం భగత్‌సింగ్ త్యాగాన్ని చాటుతుందన్నారు. ఈ పాటను తెలుగు, హిందీ, పంజాబీ భాషల్లో విడుదల చేస్తామన్నారు. ఈ సందర్భంగా ప్రజాగాయకుడు మజ్జి దేవిశ్రీ పాడిన పాటలు ఆద్యంతం ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకుడు జంగల్‌రెడ్డి, మాతా స్టూడియో అధినేత పల్లి నాగభూషణరావు, లవకుశ సినిమా ఫేమ్, కుసుడు పాత్రధారి సుబ్రహ్మణ్యం, ప్రముఖ సినీ నటి రాజ్యలక్ష్మి, నటుడు నాగార్జున డూప్ శ్రీనివాస్, నటుడు విజయ్ తదితరులు పాల్గొన్నారు.